క్లుప్తంగా

ఉపాధ్యాయులను నియమించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కెరమెరి: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఝరి, ఉర్దూ మీడియంలో ఉపాధ్యాయులను నియమించాలని గ్రామస్తులు ఎంఈవో ఆడే ప్రకాశ్‌కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం పాఠశాలకు వచ్చిన ఎంఈవోతో గ్రామస్తులు మాట్లాడారు. తరగతులకు సరిపడా ఏడుగురు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా కేవలం ముగ్గురే ఉన్నారని, ఇలాంటి పరిస్థితుల్లో విద్యా బోధన ఎలా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో యూసుఫ్, ఇసా చావుష్, రిజ్వాన్, ముసా, నిసార్, రజాక్, ఇసాక్ తదితరులు ఉన్నారు.

మారిన విద్యుత్ సిబ్బంది ఫోన్ నంబర్లు

వాంకిడి: మండల విద్యుత్ సిబ్బంది ఫోన్ నంబర్లు మారాయి. ఇకపై పాత నంబర్లు పనిచేయవని, కొత్త నంబర్లలో సంప్రదించాలని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ సరఫరాలో సమస్యలున్నా, సలహాలు, సూచనల కోసం ఏఈ 8712486532, లైన్ ఇన్‌స్పెక్టర్ (వాంకిడి, బంబార, గోయగాం, మహాగాం) 8712486533, లైన్‌మెన్ (వాంకిడి, బంబార, గోయగాం, మహాగాం) 8712486535, వాంకిడి సబ్‌స్టేషన్ 8712486534 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఒకరు మృతి

వాంకిడి: రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో అతడు మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలోని 363 జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గేడం సోనేశ్వర్ (30) శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పని ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తూ జాతీయ రహదారి దాటుతున్నాడు. ఈ క్రమంలో మహారాష్ట్ర వైపు నుంచి ఆసిఫాబాద్ వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం వేగంగా ఢీకొట్టింది. దీంతో సోనేశ్వర్ తల, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. బనార్ కొసార గ్రామానికి చెందిన ద్విచక్రవాహనదారుడు కొముురం మల్కుకు కూడా తలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే వీరిని అంబులెన్స్‌లో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోనేశ్వర్‌కు తీవ్ర రక్తస్రావం కావడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొముురం మల్కు పరిస్థితి విషమంగా ఉంది. మృతుడి తమ్ముడు గేడం సూరజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

కూలిపోయిన కల్వర్టు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ స్కూల్ సమీపంలో శుక్రవారం కంకర లోడ్‌తో వస్తున్న లారీ కాలువ దాటుతుండగా కల్వర్టు కూలిపోయింది. సమీపంలోని మంచినీటి పైపులైను పగిలిపోవడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

తెరుచుకున్న మరో బడి



విద్యార్థులతో ఎంఈవో సుభాష్

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని గొల్లగూడలో గతంలో మూతబడిన ప్రభుత్వ పాఠశాలను విద్యాశాఖ అధికారులు శుక్రవారం పునఃప్రారంభించి ఎనిమిది మంది విద్యార్థులను చేర్పించారు. ఎంఈవో సుభాష్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు నాలుగు పాఠశాలలను పునఃప్రారంభించామని తెలిపారు. గొల్లగూడ స్కూల్‌కు ఒక టీచర్‌ను కేటాయించామన్నారు. విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మౌనిక, జలపతి, సీఆర్‌పీ నగేశ్ పాల్గొన్నారు.

పాడే మోసిన మాజీ జెడ్పీటీసీ



పాడే మోస్తున్న మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రావు

బెజ్జూర్: మండలంలోని పాపన్నపేట గ్రామానికి చెందిన బీజేపీ పార్టీ గ్రామ అధ్యక్షుడు భుజాడి మల్లేష్(45) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ పాల్వాయి సుధాకర్ ఆయన నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొని పాడే మోశారు.

గుంతలు తవ్వారు.. వదిలేశారు!



లారీ చౌరస్తా సమీపంలో గుంత

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తా నుంచి లారీ చౌరస్తా మీదుగా ప్రధాన రహదారి పక్కన కేబుల్ వైర్ల కోసం గుంతలు తవ్వి వదిలేశారు. దీంతో ఈ రోడ్డు గుండా ఎస్పీఎం పేపర్ మిల్లుకు నిత్యం రాకపోకలు సాగించే లారీలతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు రోడ్డు పక్కనే చిరువ్యాపారులు తమ వ్యాపారాలు చేస్తుండడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే గుంతలు పూడ్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై నియంత్రణ రేఖ..!

కెరమెరి: మండలంలోని ఖైరీ గ్రామ పంచాయతీ అగర్‌వాడకు వెళ్లే రహదారి గ్రామ సమీపంలో రెండు వైపులా కోతకు గురైంది. దీంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో కొత్తగా వచ్చే వారు తెలియక వేగంగా వస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ విషయాన్ని గుర్తించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్వేత కోతకు గురైన రోడ్డు వెంట రాళ్లు పెట్టి రేఖ గీశారు. రెండు వైపులా రిబ్బన్ కట్టారు. అయితే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చీకటిలో ఇబ్బందులు పడుతున్న ఖాతాదారులు



కరెంట్ లేక కష్టాలు..!

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్, సర్‌సిల్క్ శాఖలో కరెంటు లేక ఖాతాదారులు ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం ఉదయం మండలంలోని రాస్పెల్లి, సార్సాల, అందవెల్లి, భట్టుపల్లి, ఈజ్‌గాం గ్రామాల నుంచి బ్యాంకుకు వచ్చిన ఖాతాదారులు మధ్యాహ్నం 1 గంట వరకు ఉక్కపోత భరించలేకపోయారు. బ్యాంకులోని రెండు ఇన్వర్టర్లలో ఒకటి మాత్రమే పని చేయడంతో కంప్యూటర్లు ఆన్‌లో ఉండగా, ఫ్యాన్లు, లైట్లు ఆఫ్‌లోనే ఉన్నాయి. దీంతో ఖాతాదారులు చీకటిలోనే తమ పనులు చేసుకోవాల్సి వచ్చింది. సర్వీస్ చార్జీలు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ అధికారులకు సౌకర్యాలు కల్పించడంలో లేదని ఖాతాదారులు ఆరోపించారు. వెంటనే బ్యాంకులో జనరేటర్ ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ విషయంపై బ్యాంకు మేనేజర్ వినోద్‌కుమార్‌ను సంప్రదించగా రెండు ఇన్వర్టర్లలో ఒకటే పని చేస్తుండడంతో సమస్య తలెత్తిందన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతులు అందజేస్తున్న కొత్తపల్లి శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని బీజేపీ నాయకుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ మండలంలోని బుర్దగూడ గ్రామంలో కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో కిమ్స్ ఆసుపత్రి సహకారంతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం క్రికెట్ పోటీల్లో బోరిగాం క్రికెట్ జట్టు గెలుపొందగా వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు కార్తీక్, సాయి, రాజు, జగన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆపరేటర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి రీజియన్‌లోని ఈపీ ఆపరేటర్లకు నిర్వహించిన ఏ గ్రేడ్ టెస్ట్‌లో అర్హత సాధించిన ఆపరేటర్లకు వెంటనే ప్రమోషన్లు కల్పించాలని ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కైరిగూడ ఓసీపీలో ఇన్‌చార్జి మేనేజర్ గౌతమ్‌కు శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి రీజియన్‌లో అర్హత ఉన్న ఏ గ్రేడ్ ఆపరేటర్లకు ప్రమోషన్ టెస్ట్ నిర్వహించి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఆపరేటర్లకు ప్రమోషన్ పత్రాలు అందించలేదని అన్నారు. అర్హత సాధించిన వారికి ఏ గ్రేడ్ ప్రమోషన్లు కల్పిస్తేనే.. బీ గ్రేడ్ ఖాళీలు ఏర్పడుతాయని తెలిపారు. బీ, సీ గ్రేడ్ ప్రమోషన్లలో జాప్యం జరుగుతోందన్నారు. ఏరియా జీఎం కమిటీ సభ్యులు రాజేశ్, కైరిగూడ అసిస్టెంట్ పిట్ కార్యదర్శి ఓదెలు, షిఫ్ట్ ఇన్‌చార్జి అంజయ్య, జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జి కోటి, నాయకులు లక్ష్మణ్, ఇక్బాల్, రారాజు, గణేష్, రఘుపతి, అంజయ్య, హర్షద్ బాబా, తిరుపతి, సంతోష్, సుధాకర్ పాల్గొన్నారు.

తాగునీరు సురక్షితమేనా..?

- మిషన్ భగీరథ పైపులకు లీకేజీలు
- బురదనీరు కలుస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- మున్సిపల్‌వాసుల తాగునీటి తిప్పలు



త్రిశూల్ పహాడ్ సమీపంలో మురుగు నీటిలో పైపులైన్ వాల్వ్

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలో చిన్నపాటి వర్షాలు కురుస్తుండడంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. కలుషిత నీటితో అనారోగ్యం బారిన పడే అవకాశాలు ఉన్నాయి. ఈ సమయంలో నీటి ట్యాంకులను శుభ్రం చేయాల్సిన మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. కాగజ్‌నగర్ మున్సిపల్ పరిధిలో మున్సిపాలిటీకి సరఫరా చేసే త్రిశూల్‌పహాడ్‌పై ఉన్న మంచినీటి ట్యాంకును శుభ్రం చేయకపోవడం, కొన్ని నెలలుగా మంచినీటి పైపులైన్ వాల్స్ పలు వార్డుల్లో లీకేజీలు ఏర్పడి బురదమయంగా మారి నీరు కలుషితమవుతుండడంతో మున్సిపాలిటీ వాసులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది.

జాడ లేని శుభ్రత..

కాగజ్‌నగర్ మున్సిపల్ పరిధిలో పట్టణానికి సరఫరా చేసే మూడు ట్యాంకులు ఉన్నాయి. ట్యాంకును నెలరోజులకు ఒకసారైన పూర్తిగా శుభ్రం చేసి ప్రజలకు నీరందించాల్సి ఉంటుంది. దీంతో పాటు ఏ రోజు శుభ్రం చేశాం. మళ్లీ ఏ రోజు శుభ్రం చేయాలనే తేదీల బోర్డు సైతం వాటర్ ట్యాంకుల వద్ద ఏర్పాటు చేయాలి. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి పట్టణంలో కన్పించడం లేదు. ఈఎస్ఐ మూలమలుపు వద్ద ఉన్న వాటర్ ట్యాంక్ అపరిశుభ్రంగా ఉంది. ట్యాంక్ నుంచి నీరు విడుదల చేసే వాల్స్ వద్ద అపరిశుభ్రంగా ఉండడంతో పాటు లీకేజీ అవుతుంది. సంబంధిత అధికారులు నిబంధనలు పాటించడం లేదు. దీంతో పట్టణ ప్రజలకు కలుషిత నీరే దిక్కవుతోంది.



ట్యాంక్ సమీపంలో లీకేజీ అవుతున్న వాల్వ్

లీకేజీలతో ఇబ్బందులు



పట్టణంలో మంచినీటి పైపులైన్లు తరచూ లీకేజీలకు గురవుతుండడంతో మంచినీరు కలుషితమవుతోంది. మంచినీటిలో నాచు, మడ్డినీరు వస్తోంది. లీకేజీలతో మంచి నీరు రోడ్లపై పారుతోంది. మున్సిపల్ అధికారులు స్పందించాలి.

– ఎన్నం శ్రీకాంత్, కాగజ్‌నగర్

పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. బడిబాటలో భాగంగా ప్రాథమిక పాఠశాలల్లో చేరిన ఒకటవ తరగతి విద్యార్థుల తలపై అక్షింతలు చల్లి అక్షరాలు దిద్దించారు. కార్యక్రమంలో ఎంఈవో ఆడే ప్రకాశ్, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు చంద్రశేఖర్, భరత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వాంకిడిలో..

వాంకిడి: మండలంలోని అర్జుగూడ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటో తరగతిలో చేరిన పిల్లలకు మండల విద్యాధికారి శివచరణ్ కుమార్ అక్షరాభ్యాసం చేయించారు. ప్రభుత్వ బడుల్లో ఉత్తమ బోధన లభిస్తుందని, ప్రతీ ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం నటరాజ్, పాఠశాల హెచ్‌ఎం ధర్మబాయి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ప్రశాంత్, జగదీష్, సీఆర్పీలు దుర్గం సందీప్, విజయ్‌బాబు పాల్గొన్నారు.

దహెగాంలో..

దహెగాం: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. మండలంలోని పీకలగుండం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. విద్యార్థులు ప్రతీరోజు ప్రభుత్వ పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు తల్లిదండ్రులు, విద్యార్థులు కృషి చేయాలని ఎంఈవో వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని రేకులగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో సామూహిక అక్షరభ్యాసాన్ని నిర్వహించారు. పాఠశాలలో చేరిన విద్యార్థులతో అక్షరాలు దిద్దించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న వినూత్న కార్యక్రమాల ద్వారా పిల్లలను పాఠశాల వైపు ఆకర్షించేలా చేయవచ్చన్నారు. తక్కళ్లపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం మహేశ్వర్‌రావు, నంబాల కాంప్లెక్స్ హెచ్‌ఎం పురుషోత్తం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తిర్యాణిలో..

తిర్యాణి: మండలంలోని గంభీరావుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఎంఈవో అంజయ్య మాట్లాడుతూ బడీడు పిల్లలు బడిలో ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కౌటాలలో..

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు మంచి విద్యాబోధన అందించాలని తహసీల్దార్ ప్రమోద్ అన్నారు. జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కౌటాల మండలం పార్డి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ నేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తారని, బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తెలిపారు. మండలంలోని కన్నెపల్లి, సాండ్గాం గ్రామాల్లోని పాఠశాలల్లో అక్షరాభాస్యం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంఈవో గావుడే హన్మంతు, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, అంజలి, ఉపాధ్యాయులు రామారావు, రాకేశ్, ప్రియాంక, భారతి, మిలింద్, సీఆర్పీలు ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్‌లో..

లింగాపూర్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో గల గోండుగూడ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అమ్మ మాట – అంగన్‌వాడీబాట కార్యక్రమంలో భాగంగా సీడీపీవో ఇందిరమ్మ అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ సోంబాయితో పాటు అంగన్‌వాడీ టీచర్ శశికళ, షీలా, అనిత పాల్గొన్నారు.



కెరమెరి: గోయగాం పాఠశాలలో అక్షరాలు దిద్దిస్తున్న ఎంఈవో ఆడే ప్రకాశ్



వాంకిడి: అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈవో శివచరణ్



కౌటాల: కన్నెపల్లిలో..




లింగాపూర్: మామిడిపల్లి గ్రామంలో..



దహెగాం: పీకలగుండంలో..



రెబ్బెన: రేకులగూడ పాఠశాలలో..



తిర్యాణి: అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న ఎంఈవో

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం



తిరుపతిని సన్మానిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్‌గా విధులు నిర్వహించి ఆర్జీ 1 ఏరియాకు బదిలీపై వెళ్తున్న రెడ్డిమల్ల తిరుపతిని శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో పర్సనల్ మేనేజర్‌ను కలిసిన ఏఐటీయూసీ నాయకులు ఏరియాకు ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని, ఉద్యోగుల సమస్యలపై తక్షణమే స్పందించే అధికారి బదిలీపై ఇతర ఏరియాకు వెళ్తుండడం బాధ కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, పర్సనల్ అధికారులు శ్రీనివాస్, ప్రశాంత్, జీఎం కమిటీ సభ్యులు రాజేశ్, జగ్గయ్య, ఆనంద్, దివాకర్, కిరణ్‌బాబు, పిట్ కార్యదర్శులు శ్రీనివాస్, రామయ్య, మల్లేశ్, రమేశ్, శైలజ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.20 లక్షల చెక్కు పంపిణీ

కెరమెరి: మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ సుబ్రిబాయికి ప్రమాద బీమా రూ.20 లక్షల చెక్కు అందజేసినట్లు ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ గిర్మాజీనాయక్, కెరమెరి టీజీబీ బ్యాంకు మేనేజర్ శ్రీపాద్ తెలిపారు. మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ మోహన్ గతేడాది నవంబర్‌లో ట్రాక్టర్‌పై నుంచి కింద పడి మృతి చెందాడు. ఆయనకు కెరమెరి టీజీబీలో ఇన్సురెన్స్ పాలసీ ఉండడంతో నామినీ, ఆయన భార్య సుబ్రిబాయికి శుక్రవారం చెక్కు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు కార్తిక్, మనీష్, వినయ్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

కాగజ్‌నగర్‌రూరల్: రైతులు రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. మండలంలోని ఈజ్‌గాం గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను శుక్రవారం సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, భూ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని ఝరి, ఏసాపూర్, అంతాపూర్ గ్రామాల్లో శుక్రవారం కొనసాగిన భూభారతి రెవెన్యూ సదస్సుల్లో కేవలం మూడే దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ భూమేశ్వర్ తెలిపారు. అంతాపూర్, ఏసాపూర్ గ్రామ పంచాయతీల్లో అన్ని భూములు రిజర్వు ఫారెస్టు, బీడీపీపీ ల్యాండ్లు కావడంతో భూ భారతిలో వారి భూసమస్యలకు పరిష్కారం లభించదని రైతులు దరఖాస్తులు చేయనట్లుగా తెలుస్తోంది. ఝరి గ్రామ పంచాయతీకి చెందిన దరఖాస్తులు వచ్చాయి. డీటీ సంతోష్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పవన్‌నాయక్, సేవంత, ఇర్షాద్, వసంత్, విజయలక్ష్మి, సురేశ్, బాపూరావు, రాజు, రమేశ్ తదితరులు ఉన్నారు.

'జర్నలిస్టుల పిల్లలకు రాయితీ ఇవ్వాలి'

ఆసిఫాబాద్‌రూరల్: జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో రాయితీ కల్పించాలని కోరుతూ శుక్రవారం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం సూపరింటెండెంట్ రమణచారికి వినతిపత్రం అందజేశారు.